క్లుప్తంగా

సార్వత్రిక సమ్మె వాయిదా

యానాం: కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ల రద్దు కోరుతూ మే 20న చేయాల్సిన సార్వత్రిక సమ్మె జూలై 9కు వాయిదా వేసినట్టు శనివారం సీఐటీయూ అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా భారత్–పాకిస్తాన్ మధ్య పెరిగిన యుద్ధ వాతావరణం, సరిహద్దు రాష్ట్రాల్లో ప్రజల సాధారణ స్థితికి ఇంకా చేరుకోకపోవడం తదితర కారణాలతో సమ్మెను వాయిదా వేయడానికి ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో చలివేంద్రాన్ని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శనివారం ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ప్రభుత్వ ఆదేశాలతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి డి.శివప్రసాద్, వీఆర్వో కె.వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే నాన్ మెడికల్ కోర్సుల్లో కోటా

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలో ప్రభుత్వ స్కూల్స్‌లో చదివే విద్యార్థులకు ఎంబీబీఎస్ తదితర మెడికల్ కోర్సులకు ప్రస్తుతం 10 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తున్నామని దీనిని నాన్ మెడికల్ కోర్సుల్లో సైతం అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని సీఎం రంగసామి ప్రకటించారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్స్‌లో చదివిన వారిలో నీట్ అర్హత సాధించిన వారికి ప్రస్తుతం ఎంబీబీఎస్ తదితర కోర్సుల్లో కోటా అమలు చేస్తున్నామని త్వరలో ఉన్నత విద్యా సంస్థల్లో సైతం నాన్‌నీట్ కోర్సుల్లో సైతం కోటా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

తాళ్లరేవు: మండల వనరుల కేంద్రంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర (స్టూడెంట్ కిట్) స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజడ్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో మోకా ఉమా, సీఆర్పీలు టి.మీరాసాహెబ్, కె.శ్రీనివాసరావు, ఏ.ఆశీర్వాదం, కె.భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు



చిన్నారులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు

అమలాపురం రూరల్: చిన్న వయసులోనే నృత్య ప్రదర్శనలిచ్చి 10 ప్రపంచ రికార్డులలో తమ పేరును సుస్థిరం చేసుకున్నారు. ఇందుపల్లి ఎ1 ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో గంధం తనుశ్రీ, గంధం బ్రహ్మణిల నాట్య ప్రదర్శనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ సౌత్ ఇండియా కో–ఆర్డినేటర్ జ్యోతి రంగా న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చిన్నారులను సత్కరించి అభినందించారు. అనంతరం చిన్నారులకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు ప్రశంసాపత్రాలను అందజేశారు. నాట్య గురువు సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. తనుశ్రీ, బ్రహ్మణిలను తల్లిదండ్రులు గంధం ఆదినారాయణ, దేవి దంపతులు అభినందించారు.

క్రీడాకారులకు అభినందనలు

అమలాపురం టౌన్: అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–11 జిల్లా స్థాయి చెస్ పోటీలు, రాష్ట్ర స్థాయి ఎంపికలు శనివారం ఉత్కంఠంగా జరిగాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 మంది పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. పోటీల్లో బాలుర విభాగంలో ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన పితాని ధ్యాన సత్య కార్తీక్ ప్రథమ స్థానం, అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన కొడమంచిలి రిషి వర్ధన్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన జాన్ బెస్లీ ప్రథమ స్థానం, అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామానికి చెందిన అడబాల ప్రావీణ్యశ్రీ ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఆయా విజేతలు ఈనెల 24న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–11 చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మాతృ వియోగం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తల్లి శ్రీరామ రాఘవమ్మ (90) వృద్ధాప్యం, అస్వస్థతతో శనివారం సాయంత్రం మృతి చెందారు. స్థానిక నారాయణపేటలోని ఆమె తన స్వగృహంలో మృతి చెందారు. మాతృ వియోగంతో బాధపడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని మున్సిపల్ కార్యాలయ అధికారులు, పలువురు కౌన్సిలర్లు పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతి చెందిన రాఘవమ్మకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

అతివేగంతో రోడ్డు ప్రమాదాలు

జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం రూరల్: అతి వేగమే రోడ్డు ప్రమాదాలకు మూలం. అతి వేగాన్ని నిరోధించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సాఫీ ప్రయాణంతో పాటు సురక్షిత గమ్యం సాకారమవుతుందని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. అమలాపురం స్నేహిత వలంటీర్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ అసెట్ సహకారంతో స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సుకు ఎస్పీ కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్య డ్రైవింగ్‌తో అతివేగానికి నిండు ప్రాణాలెన్నో బలి అవుతుంటే బాధ కల్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు కూడా విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులను గమ్య స్థానాలకు క్షేమంగా చేర్చాలన్నారు. సదస్సుకు మరో ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ అసెట్ చీఫ్ మేనేజర్ సెక్యూరిటీ పి.శంకర్ మాట్లాడుతూ తాను అతిపెద్ద రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలతో బయటపడి ఈ రోజు మీ ముందు మాట్లాడుతున్నానంటే ఆ రోజు రోడ్డు ప్రమాద సమయంలో తాను హెల్మెట్ ధరించడం వల్లే సురక్షితంగా ఉన్నానని తన చేదు జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. ద్విచక్రవాహనచోదకులు విధిగా హెల్మెట్, కారు, ఇతర వాహనాలైతే సీటు బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో స్నేహిత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కుంచే స్నేహలత, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజులు ప్రసంగించి రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులకు ఓఎన్‌జీసీ అసెట్ సమకూర్చిన ట్రాఫిక్ పరికరాలను ఎస్పీ కృష్ణారావు, అసెట్ చీఫ్ మేనేజర్ సెక్యూరిటీ శంకర్‌లు పంపిణీ చేశారు. ఆటో డ్రైవర్లతో పాట పలు వాహనాల యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. డీజీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్, అమలాపురం ట్రాఫిక్ ఎస్ఐ ఎం.ఏసుబాబు తదితరులు సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు



ట్రాఫిక్ పోలీసులకు వైట్ హెల్మెట్లు అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఓఎన్‌జీసీ అసెట్ చీఫ్ మేనేజర్ శంకర్

అక్రమ అరెస్టులు తగవు

వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డిలను మద్యం కేసులో కక్ష సాధింపుగా అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్‌సీపీ అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. సాకుర్రులో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు నివాసం వద్ద విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులపై తప్పుడు కేసులు పెట్టి కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వం అరెస్టుల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారన్నారు. తనపై కూడా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయినా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, అమలాపురం రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, మాజీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్‌ఎంపీపీ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు కేతా భాను తేజ, సర్పంచ్ చెల్లుబోయిన నాని నాయకులు గుత్తుల సత్తిబాబు, దొంగ బాలాజీ, గుత్తుల మురుగు రాజు,కుడిపూడి రామకృష్ణ, దొమ్మేటి శేఖర్, దొమ్మేటి మోహన్, కూడుపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌ఓ రాజకుమారి



ముమ్మిడివరంలో మానవహారం నిర్వహిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాలను సిబ్బందితో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణ స్థిరత్వం, సమాజ వాతావరణం స్థితిస్థాపనను ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలను చేపట్టామన్నారు. వాతావరణ పరిస్థితులపై అవగాహన పెంపొందించడానికి. నీటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. ఉపాధి పనుల ప్రదేశాల్లో షెడ్లు, తాగు నీటి సదుపాయం, వైద్య శిబిరాలు నిర్వహించారన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి కె. కాశీ విశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, విదేశీ వ్యవహారాల విభాగం ఉద్యోగులు నాగేంద్ర, నాగ సుశీల, సెక్షన్ సూపరింటెండెంట్లు రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీలో కమీషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి బళ్ల గేటు సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ప్రోత్సహించాలని మొక్కలను పెంచాలని కాలుష్యాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. ఏఈ పీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్‌రాజు, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

అమలాపురం రూరల్: పట్టణ, రూరల్ పరిధిలో ఎస్సీ,బీసీ సంక్షేమ హాస్టళ్లలో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. సబ్ యూనిట్ ఫీసర్ల ఎన్‌వీ రామారావు, ఎస్.రాజబాబు, ఫైలేరియా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పేరూరు పీహెచ్‌సీ సూపర్‌వేజర్ ఆర్ .కామేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోనీ భీమపల్లిలో శనివారం నిర్వహించిన బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా ఏపీడీ ఎల్.రాంబాబు, మండల ప్రత్యేక అధికారి ఎంఏ షంషి, ఎంపీడీవో పి.రాజ్‌కుమార్, కార్యదర్శి పి.నాగేశ్వరరావులు మొక్కలను నాటారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను పరిశీలించారు. సర్పంచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బయో ఫోరం సంయుక్త కార్యదర్శిగా బాలకృష్ణ



అమలాపురం టౌన్: రాష్ట్ర బయో ఫోరం సంయుక్త కార్యదర్శిగా అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు కుంచే బాలకృష్ణ ఎన్నికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర బయో ఫోరం సమావేశం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశం అనంతరం జరిగిన కమిటీ ఎన్నికలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు బాలకృష్ణ తెలిపారు. ఆయనను జిల్లా బయో ఫోరం గౌరవాధ్యక్షుడు కె.సాయిరామ్, జిల్లా ఫోరం ప్రతినిధులు బి.జీవన్, ఎం .రామలక్ష్మి, ఎ.గోపాలకృష్ణ, డాక్టర్ పి.ప్రసాద్, ఎన్.సుమన్, ఎ.జగ్గారావులు తదితరులు అభినందించారు. బయో ఫోరం ద్వారా పాఠశాలల్లో బయాలజీ పాఠ్యాంశంపై విద్యార్థులకు మరింత అవగాహన పెంచుతానని బాలకృష్ణ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఔదార్యం

అల్లవరం: మండలంలోని తూర్పులంక గ్రామంలో మంద వీర వెంకట సత్యనారాయణ సంబంధించిన ఇల్లు పిడుగుపాటుకు గురై అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబం సర్వం కోల్పోయింది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ , బొమ్మి నరసింహమూర్తి మంగాయమ్మ ట్రస్ట్ సహకారంతో బాధిత కుటుంబానికి దుస్తులు, బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులను అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ బాధితులకు తక్షణమే నూతన గృహాన్ని మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ కడలి గంగాచలం, రేవు శ్రీనివాసరావు, మల్లవరపు శ్రీను, బుంగ ఆనంద శేఖర్, గెద్దాడి సింహాద్రి, కట్టా నరేష్, కట్టా శ్రీను, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితునికి నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మానసిక ఒత్తిడి లేని జీవనాన్ని అలవాటు చేసుకోవాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర

అమలాపురం టౌన్: మానసిక ఒత్తిడి లేని జీవనాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుని ప్రశాంతంగా గడపాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గాదొర అన్నారు. ఇందుకోసం రక్తపోటు (బీపీ) దరి చేరకుండా వ్యాయామాలతో హైపర్ టెన్షన్‌ను జయంచాలని సూచించారు. వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీని శనివారం ప్రారంభించి ప్రసంగించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భారతి లక్ష్మి మాట్లాడుతూ రక్తపోటు రాకుండా ప్రతీ ఒక్కరూ జాగ్రత్త పడాలని సూచించారు. టెన్షన్ అనేది లేకుండా ప్రతీ విషయాన్ని సున్నితంగా ఎదుర్కోవాలన్నారు. డాక్టర్ సుమలత, ఫిజియోథెరిపిస్ట్ ఎల్‌వీఎస్ ప్రవల్లిక, సోషల్ వర్కర్ కొల్లాటి ప్రమీల తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



అమలాపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భారత లక్ష్మి తదితరులు

ఆంగ్ల భాష నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు శిక్షణ నేడు

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఒక రోజు ఆఫ్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన 'విల్ టు కెన్' ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టరు రామేశ్వర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణనిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. అయినవిల్లి మండలం పోతుకుర్రు గ్రామానికి చెందిన సాగిరాజు సత్యనారాయణరాజు(47) శనివారం రొయ్యల చెరువు వద్దకు వెళ్తుండగా బొండాయి కోడుతూము పెట్రోలు బంక్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరాజును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఆయనకు భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన శనివారం ఉదయం కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కొత్త డంపింగ్ యార్డ్ ఆవశ్యకతపై ప్రస్తావించారు. మున్సిపాలిటీకి శాశ్వతంగా దాదాపు 15 ఎకరాల్లో అధికారిక డంపింగ్ యార్డ్ స్థలాన్ని సేకరించేలా ఎమ్మెల్యే ఆనందరావు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును ఆదేశించారు. డంపింగ్ యార్డ్‌కు అవసరమైన భూమి కొనుగోలుకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌కు చెందిన నిధులతో మరికొన్ని గ్రాంట్లను వినియోగించాలని కౌన్సిలర్లు సూచనలు చేశారు. మాస్టర్‌ప్లాన్‌లో రహదారి విస్తరణలో ఇరువైపులా స్థల సేకరణలో వెసులుబాటు కల్పనపై చర్చించారు. తొలిదశ రోడ్ల విస్తరణకు దాదాపు రూ.100 కోట్ల వ్యయం అవుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

సమావేశంలో వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు మాట్లాడుతూ పట్టణంలోని ఓ డాక్టర్ దంపతులకు చెందిన భవనం రోడ్డుకు వెనక్కి ఉన్నప్పటికీ, ఆక్రమణలు అంటూ నోటీసులు ఇవ్వడం వ్యక్తిగత కక్షతోనే ఇచ్చారని ఆరోపించారు. ఆ రోడ్డులో ఉన్న మొత్తం ఆక్రమణలు తొలగించాలని, అందుకు తామంతా సహకరిస్తామని స్పష్టం చేశారు. కేవలం డాక్టర్ భవనాన్నే ప్రస్తావిస్తే, దీనిపై వారికి అండగా ఉండి పోరాడతానని వైస్ చైర్మన్ నానిరాజు తెలిపారు. తన వార్డు పరిధిలో ఉన్న ఆ భవనం విషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని కౌన్సిలర్ దొమ్మేటి రాము ప్రశ్నించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి రాణి సంయుక్త కౌన్సిలర్‌గా మీ దృష్టికి తీసుకురావాలని అంగీకరించడం గమనార్హం. డాక్టర్ భవనం గురించి ప్రస్తావించమని ప్రకటించడంతో ఆ అంశానికి తెరపడింది. మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేయని సైరన్ మోగే యంత్రాన్ని పునరుద్ధరించాలని కౌన్సిలర్ యండమూరి గంగ డిమాండ్ చేశారు. పట్టణంలో అనధికారికంగా సాగుతున్న చేపల మార్కెట్‌ను రైతు బజార్‌లోకి తరలించాలని కౌన్సిలర్ బండారు గోవిందు సూచించారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఈ విషయంపై కమిషనర్ ఓ నివేదిక ఇవ్వాలని సూచించారు. కౌన్సిల్ కో–ఆప్షన్ సభ్యుడు జాన్సన్ బెల్లీ మాట్లాడుతూ తన నివాస ప్రాంతంలో రోడ్డు వేయాలని పలుమార్లు కోరుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్లు ఎ.శ్రీను, ఎ.చంటి, బి.వెంకటేశ్వరరావు, కె.దుర్గాబాయి తదితరులు మాట్లాడుతూ తమ తమ వార్డుల్లో సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చి చర్చించారు.



సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు

వేతన బకాయిలు చెల్లించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ రాజుతో చర్చిస్తున్న కార్మిక నేతలు సత్తిబాబు, బాబి తదితరులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పారిశుద్య విభాగంలో పనిచేస్తున్న వికాస్ కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొప్పుల బాబి కమిషనర్ కేవీఆర్ఆర్ రాజును కోరారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు, పారిశుద్య కార్మికుల సమక్షంలో కొప్పుల బాబి కమిషనర్ రాజుకు ఈ మేరకు వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. బకాయి వేతనాల చెల్లింపులపై కార్మిక నేతలు, కమిషనర్ మధ్య చర్చలు జరిగాయి. ఈనెల 19న వికాస్ పారిశుద్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించేలా చూస్తానని కమిషనర్ రాజు హామీ ఇచ్చారు.

చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా వాకర్స్ హెల్త్ క్లబ్ స్థానిక గోల్డ్ మార్కెట్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టోజు సన్యాసిరావు, చిట్టూరి పెదబాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లయన్స్‌క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్ క్లబ్ స్థాపించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పేరయ్యరాజు, పి.నరేంద్ర రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు కోరంగి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద గవర్నర్ సేవా కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు స్థానిక లయన్స్ క్లబ్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి ఆదిద్రావిడార్ అండ్ షెడ్యూల్డు ట్రైబ్స్ డవలెప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(పిఏడీఎస్‌టిడిసి)ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్–2026 పరీక్షకు ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కేంద్రపాలితప్రాంతం పుదుచ్చేరికి చెందిన ఎస్సీ, ఎస్టీలై ఉండాలని, 35 ఏళ్లకు మించకుండా, ఎస్ఎస్‌సీ, ఉన్నతవిద్యను పుదుచ్చేరిలో అభ్యసించిన వారై ఉండాలని సూచించారు. అభ్యర్థులకు ప్రవేశపరీక్షల నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఉచిత కోచింగ్‌కు ఎంపిక ఉంటుందన్నారు. దరఖాస్తులను 'పివై.జిఒవి.ఇన్' వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని పూర్తిచేసి యానాం పాడ్కో ఆఫీసులో అందజేయాలని కోరారు.

గోవిందనామాల కనువిందు



అడుగు భాగంలో గోవింద నామాల రూపంలో ఉన్న ఐస్

డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కాపులపాలెంలోని కరుణకు చెందిన జ్యూస్ సెంటర్‌లోని ఫ్రీజర్‌లో ఉన్న ఐస్ గెడ్డ కింద భాగంలో గోవిందనామాలున్న రూపంలో గెడ్డనీరు దర్శనమిచ్చింది. దీంతో ఈ దృశ్యాన్ని పలువురు తమ ఫోన్‌లలో వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు.


కాట్రేనికోన

ప్రకృతి సోయగం.. గౌతమీ తీరం

యానాంలో గౌతమీ తీరం..

శనివారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం ముదురు నీలిరంగు దృశ్యంతో అందాన్ని సంతరించుకుంది. దీంతో రాజీవ్ రివర్ బీచ్ వెంబడి విగ్రహాలు సందర్శకులు మరింత కనువిందు చేశాయి. ఈ అందాల చిత్రాలను ప్రకృతి ప్రేమికులు తమ ఫోన్‌లతో ఫొటోలు తీసుకున్నారు.


యానాం



యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి



గోదావరి వద్ద శివంబాత్



పుష్కరమాత విగ్రహం